క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టకు మంత్రికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఈఓ, కమిటీ సభ్యులు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందించారు. ఈ మేరకు ఆలయ ఈఓ కృష్ణవేణి, ఆలయ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల్‌రెడ్డి, గాండ్ల శ్రీనివాసులు మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. దేవదాయశాఖ కమిషనర్ సత్యన్నారాయణ మూర్తిని ఆహ్వానించినట్లు తెలిపారు.

మానవత్వంతో మెలగాలి

సింగరాయకొండ: ప్రతి వ్యక్తి మానవత్వంతో మెలుగుతూ సమాజ సేవలో తమ వంతు సహాయసహకారాలు అందించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ చైర్మన్ జెట్టి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని పాకలలో మంగళవారం సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సంస్థ సభ్యులు పాకల కోటేశ్వరరావు, కోటపాటి నారాయణ, హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.274

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట గ్రామాల రైతులు 1247 బేళ్లు తీసుకురాగా 1212 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.274, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.264.76 పలికింది. వేలంలో 38 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కందుకూరు: కందుకూరు–1వ పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన పొగాకు వేలంలో 1234 బేళ్లను విక్రయించారు. వేలంలో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.274 లభించగా, అత్యల్ప ధర రూ.160 వచ్చింది. ఇప్పటికే కందుకూరు–2 వేలం కేంద్రంలో ఈ సీజన్ వేలం ప్రక్రియ ముగిసింది. మిగిలిన ఒకటవ వేలం కేంద్రంలో కూడా శనివారంతో వేలం ముగించనున్నట్లు అధికారులు తెలిపారు.

రీ వెరిఫికేషన్‌కు 247 పెన్షన్లు

పామూరు: మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో మే నెలాఖరు లోగా కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 247 పెన్షన్లు వెరిఫికేషన్ కోసం వచ్చినట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. వాటిని మరోసారి రీ వెరిఫికేషన్ చేసి సెప్టెంబర్ 1వ తేదీ పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉలవపాడు: ఉలవపాడులోని అంబేద్కర్ నగర్‌లో గర్భిణులకువైద్య పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి గర్భవతులను పరీక్షించారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమ్యజ్యోతి పరీక్షలు చేశారు. ఐరన్ మాత్రలు కచ్చితంగా మింగాలలన్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి పొన్నలూరు మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన మార్తాటి వెంకటరాజా, ప్రియాసువర్ణ దంపతులు రూ. 12,506, కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్, ఈశ్వరమ్మ దంపతులు రూ.6579లు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అలాగే అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన నీటిశెట్టి మనోజ్‌కుమార్, వెంకటేశ్వరగుప్తాలు రూ.7500ల విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, మాదాలా మాల్యాద్రి, ఆవుల మాధవరావు, గాండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకిచర్లలో ఆధార్ క్యాంపు

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్లలో బుధవారం ఆధార్‌క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. చాకిచర్ల సచివాలయంలో ఆధార్ అప్డేట్ చేయించుకోవాల్సిన వారు, బాల ఆధార్‌లు చేయించుకోవాల్సిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు క్యాంపు కొనసాగుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 1వ వార్డులో సచివాలయం పరిధిలో మంగళవారం జరిగిన డ్రైడే కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గఫార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీను, విద్యుత్ ఏఈ పవన్‌కుమార్, మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రతి రైతు ఈ పాస్‌పుస్తకం కలిగి ఉండాలి
- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



లింగసముద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలని, ప్రతి రైతు ఈ పాస్‌పుస్తకం కలిగి ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూ సమస్యలకు సంబంధించి మంగళవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపవని, ముత్యాలపాడు, చీమలపెంట, ఆర్‌ఆర్‌పాలెం, మొగిలిచర్ల తదితర గ్రామాల్లో కొందరు 1బీ, అడంగల్ పాత రికార్డుల్లో గతంలో పనిచేసిన తహసీల్దార్లు రికార్డుల్లో కొట్టివేతలు చేసి ఒకరికి ఉండాల్సిన భూమిని మరొకరికి ఉన్నట్లుగా చూపించారని, దాని ప్రకారం ఆన్‌లైన్ చేశారని ఇవన్నీ తమ దృష్టికి రావడంతో తహసీల్దార్ మీరావలితో కలిసి రికార్డులను తనిఖీ చేయగా రికార్డుల్లో కొట్టివేతలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఆర్‌ఆర్‌పాలెం సర్వే నంబర్ 275, మొగిలిచర్లలో సర్వే నంబర్ 503/2 కొట్టివేతలు జరిగాయన్నారు. చీమలపెంట సర్వే నంబర్ 93/1లో మొత్తం విస్తీర్ణం 5.66 ఎకరాల భూమి ఉండగా వీఆర్‌కోట వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు కూడా ఇదే సర్వేనంబర్‌లో ఉండడంతో రైతులకు ఆర్‌అండ్‌బీ రోడ్డును కూడా ఆన్‌లైన్ చేశారన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డును తొలగించి మిగిలిన భూమిని రైతులకు ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ముత్తంవారిపాలెం 114, 116, 117 సర్వే నంబర్లలో 15 ఎకరాల వాగు పోరంబోకు భూమిని కొండాపురం మండలం భీమవరప్పాడుకు చెందిన వారు ఆక్రమణకు గురి చేశారని వాటన్నింటినీ పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు చెప్పారు. ముత్యాలపాడు సర్వే నంబర్ 112లో 13.14 ఎకరాల భూమి వెల్లంపల్లి నారాయణకు పట్టాలు ఉంటే రికార్డుల్లో కొట్టివేసి వెట్టిమాన్యం కింద రాశారన్నారు. ముత్యాలపాడు సర్వే నంబర్లు 100/2లో 11.06 ఎకరాలు, 206/1లో 11.44 ఎకరాలు, 131/1లో 1.18 ఎకరాలు భూమిని గతంలో పని చేసిన తహసీల్దార్లు ట్యాంపరింగ్‌కు పాల్పడి ఎటువంటి ఆధారాలు లేకుండా రికార్డుల్లోకి ఎక్కించారన్నారు.

తిమ్మారెడ్డిపాలెంలో మాలకొండ మాన్యాన్ని కొందరు ఆక్రమించి బ్యారన్లు, ఇళ్లు, వాముల దొడ్లు దిబ్బలు వేశారని, ప్రభుత్వం విడుదల చేసిన ఎండోమెంట్ రూల్స్ ప్రకారం ఆక్రమించినవారికి నోటీసులు జారీ చేస్తారన్నారు. తిమ్మారెడ్డిపాలెం నుంచి వెంగళాపురం, యర్రారెడ్డిపాలెం మీదుగా వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లె వరకు రూ.7.77 కోట్లతో నిర్మించే రోడ్డుకు టెండర్లు జరిగాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంపీడీఓ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన వరికూటి



విజయసాయిరెడ్డితో వరికూటి, పార్టీ నాయకులు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ పురోభివృద్ధి గురించి విజయసాయిరెడ్డికి వివరించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, నల్లూరి సురేంద్ర, పాకల మాజీ సర్పంచి సుందరరెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ పద్మజ

గుడ్లూరు: జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రార ంభించాలని డీఎల్‌డీఓ పద్మజ, గృహనిర్మాణ శాఖ డీఈ సీహెచ్.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పోట్లూరు, చినలాటరఫి, నాయుడుపాలెం సచివాలయాల పరిధిలో జగనన్న కాలనీల లే అవుట్లను మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ఆయా సచివాలయాల్లో లబ్ధిదారులకు గృహ నిర్మాణాలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ, డీఈలు మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న కాలనీలు ద్వారా గృహాలను మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ మొత్తం ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించి త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. పోట్లూరులో 41, చినలాటరఫిలో 63, నాయుడుపాలెంలో 32 గృహ నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. వారి వెంట ఈఓపీఆర్డీ వై.వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ కె.వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా
- ఎంపీపీ అత్యాల జపన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జపన్య

పీసీపల్లి: మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీపీ అత్యాల జపన్య తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అత్యాల జపన్య అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతో రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మండలంలో 10,237 రేషన్‌కార్డులు ఉంటే 70 శాతం మంది మాత్రమే రేషన్ తీసుకుంటున్నారన్నారు. ప్రతి రోజు 20 నుంచి 30 ట్రాక్టర్ల కర్ర అక్రమంగా తరలిస్తున్నా అటవీ శాఖాధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు సమావేశందృష్టికి తీసుకువచ్చారు. చౌట గోగుల పల్లి , వెంకటేశ్వరాపురం మీదుగా పీసీపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అర్జీ ఇచ్చారు. ఎంఈఓ శ్రీనివాసరావు ప్రతి పాఠశాలలో డిజిటల్ బోధనకు ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున వెచ్చించనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ పవన్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీ ప్రసద్ద, ఈఓఆర్డీ మల్లీశ్వరి వారి శాఖల నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడిడ్ మాట్లాడుతూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి గురించి సర్వే జరుగుతుందని, దరఖాస్తుదారులంతా అందుబాటులో ఉండాలన్నారు. .

ఈ సందర్భంగా ఎంపీపీ అత్యాల జపన్య మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరైన మత్స్యశాఖ, ఆర్ అండ్‌బీ, గృహ నిర్మాణ, కేజీబీవీ, ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి సతీష్, పీడీసీసీ బ్యాంకు సభ్యులు పోలు జయరామిరెడ్డి , వైద్యాధికారి రాజ్యలక్ష్మి, వెటర్నరీ అధికారి పేరయ్య, వై మోహన్ రెడ్డి, శ్రీనివాసుయాదవ్, నారాయణరెడ్డి, సీత ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు



మహబూబ్ బాషాను సన్మానిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

జరుగుమల్లి: చదువుతోపాటు క్రీడలతో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య రికార్డులను ఆయన మంగళవారం పరిశీలించారు. వ్యాయామ విద్య అవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన డాక్టర్ మహబూబ్‌బాషాను ఘనంగా సత్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్‌టీ రమేష్, మురళి, కోటేశ్వరరావు, రమేష్, హెప్సీబా పాల్గొన్నారు.

నెలాఖరు లోగా దరఖాస్తు చేసుకోండి

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగు చేసుకోదలిచిన రైతులు ఈ నెలాఖరు లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటి వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలు సాగుకు 12 రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. నీటి వసతి ఉండి 5 ఎకరాలులోపు ఉన్న రైతులు సన్న, చిన్నకారు రైతులు అర్హులన్నారు. మామిడి, నిమ్మ, దానిమ్మ, సపోట, కొబ్బరి, ఉసిరి, జామ తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. 3 ఏళ్ల పాటు మొక్కల సంరక్షణకు ఉపాధి నిధుల నుంచి ఎకరాకి రూ. లక్ష వరకు ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపురం పాఠశాలకు గ్రామానికి చెందిన చీమలదిన్నె బాల అంకయ్య, బుద్ధారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండ్రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి రూ.15వేల విలువైన ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేశారు. ఈ ప్లాంట్‌ను ఎంఈఓలు సంజీవ, శ్రీనివాసులు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి దాతల సహకారం మరువలేనిదన్నారు. హెచ్‌ఎం సీహెచ్ అరుణ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం దాతలను అభినందించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌తో గ్రామాల అభివృద్ధి



పాకలలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సింగరాయకొండ: గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, అది స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంతోనే సాధ్యమని కేంద్ర ప్రభుత్వ అధికారి ఐపీఎస్‌ఓఎస్ బృంద సభ్యుడు ఎ.మోహన్ పేర్కొన్నారు. పాకల గ్రామంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామ సచివాయం, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, హైస్కూల్, దేవాలయం, డంపింగ్ యార్డు, రోడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలను ఆరా తీశారు. కేంద్ర బృందం సభ్యులు పి.చక్రధర్, షేక్ ఖాజావలి, కొండపి నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ అశోక్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ చిమట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

పామూరు: ప్రపంచశాంతి కోరుతూ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ సెంటర్ నుంచి ప్రధాన వీధుల్లో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ శాంతి యుత వాతావరణం, శాంతియుత సమాజం దేశానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రతి ఒక్కరూ ద్వేషాలు వీడి సామరస్యంగా జీవించాలన్నారు. మాజీ సర్పంచ్ మనోహర్, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, కొరివి రమణయ్య, ఆకుల మాల్యాద్రి, ముక్కు తిరుపతిరెడ్డి, కోడూరి ప్రభాకరరావు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పామూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్స్ మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఈవోఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డికి అందజేశారు. ప్రకాశం, కొండయ్య, మాలకొండయ్య, పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన

కనిగిరి రూరల్: హత్యకు గురైన విద్యార్థిని మంజుల మృతదేహానికి కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలోనే పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, పలు సంఘాల నాయకులు మంగళవారం రాత్రి నిరసన తెలిపారు. ప్రభుత్వ అంబులెన్స్‌లో ఒంగోలుకు పంపిస్తామన్నా వారు నిరాకరించి బైటాయించారు. దీనిపై ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ మృతి చెందిన బాలిక మైనర్ అయినందున, గ్రూప్ డాక్టర్స్ సమక్షంలోనే పోస్టుమార్టం చేయాలన్నారు. అయితే కనిగిరి వైద్యశాలలో సీనియర్ వైద్యులు లేకపోవడంతోనే ఒంగోలుకు రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కానీ నిరసనకారులు మాత్రం వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి కనిగిరి ఆస్పత్రిలోనే బాలిక మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని, జిల్లా నుంచి వైద్యులను కనిగిరికే పంపాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడటం వల్ల ప్రజారోగ్యాన్ని కాపాడటమే కాకుండా లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారులు వెంకట్రావు, విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొణిజేడు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ రైతులకు ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ పథకం నుంచి రూ.10 వేల విలువైన కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు మాట్లాడుతూ.. పీఎండీఎస్ విత్తనాలు, కిచెన్ గార్డెన్ కిట్లను ఎస్సీ రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. త్వరలో సీడ్ కిట్, లింగాకార బుట్టలు, డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధర దక్కుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సాహిస్తోందన్నారు. రసాయనాలతో పంటల సాగుకు ప్రకృతి వ్యవసాయానికి మధ్య వ్యత్యాసాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంపీటీసీ బుర్రా అంకరాజు, వీపీఏ సౌమ్య, ఐసీఆర్పీలు శృతి, సుజాత, మరియమ్మ, జ్యోత్స్న, హరిత, జ్యోతి, లీడ్ ఫార్మర్ కవిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



విద్యుత్ సమస్యపై ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సుబ్బారావు

కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కొండసింగు స్వప్న కుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కొందరు అధికారులు ఒంగోలులో సమావేశాలకు అని వెళ్లగా కింది స్థాయి సిబ్బంది హాజరయ్యారు. తహసీల్దార్ టి.నరసింగరావు సైతం ఈఆర్‌ఓ సమావేశంలో పాల్గొనడంతో ఆచన స్థానంలో డీటీ హాజరయ్యారు. పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావడంతోపాటు అధికారుల గైర్హాజరుపై ప్రశ్నించారు. చేసిన పనులకు బిల్లులు పెట్టడం లేదని, పశుసంవర్ధక శాఖ అధికారి ఎందుకు హాజరుకాలేదని ఎంపీడీఓను వైస్ ఎంపీపీ వేముల వెంకటప్రసాద్ ప్రశ్నించారు. సమావేశం నిర్వహించి ఉపయోగం ఏమిటని బయటకు వెళ్లిపోయారు. విద్యుత్ సమస్యలపై ఏఈ కోటయ్యను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్తయిన ఓటర్ల సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి: నియోజకవర్గంలో గతనెల 21 నుంచి నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే పూర్తయినట్లు ఈఆర్‌ఓ బి.నారదముని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్‌ఓ నారదముని అధ్యక్షతన మంగళవారం రాజకీయ పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారదముని మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు 283 పోలింగ్ కేంద్రాల పరిధిలో నెలరోజుల పాటు 1,03,714 ఇళ్లకు వెళ్లి సర్వే చేసినట్లు తెలిపారు. మొత్తం 2,36,205 మంది ఓటర్ల వివరాలు పరిశీలించారని చెప్పారు. డబుల్ ఓట్లు, మార్పులు చేర్పులు, పూర్తిగా వలస పోయిన ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలో 2714 మంది నూతనంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓటర్లకు సర్వేకు సంబంధించి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని రాజకీయ పార్టీల నేతలను కోరారు. సమావేశంలో ఆరు మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాలు తనిఖీ

గుడ్లూరు: మండలంలోని పోట్లూరు, చినలాటరఫి, నరసాపురం గ్రామాల్లోని ఉన్న సచివాలయాలను డీఎల్‌డీఓ పద్మజ మంగళవారం తనిఖీ చేశారు. మూడు సచివాలయాల్లో రికార్డులు, రిజిష్టర్లు, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజు సమయపాలన పాటిస్తూ సకాలంలో చేరుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. డీఎల్‌డీఓ వెంట ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సుబ్బరాజు, సుజాత, శివపార్వతి, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

కందుకూరు: మెగాస్టార్ చిరంజీవి 68వ పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కోవూరు రోడ్డులోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు అన్నదానం చేసి, సరుకులు పంపిణీ చేశారు. అలాగే యువరాజ్ థియేటర్ వద్ద సంబరాలు నిర్వహించి ప్రేక్షకులకు స్వీట్లు పంపిణీ చేశారు. కె.రమేష్, పట్టణ చిరంజీవి యువత అధ్యక్షుడు దండే రమేష్, కె. హరిబాబు, బుడ్డు, వంశీ, సాయిచందునాయుడు, దారం మహేంద్ర, సాయికళ్యాణ్, నవీన్, మనీ, సాయిరాం, మనోజ్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంఈఓ ప్రసాద్ మృతి

కందుకూరు రూరల్: కందుకూరు ఎంఈఓ నూకతోటి ప్రసాద్ అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. కొంత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతుల్లో ఎంఈఓ–1 కందుకూరులో విధుల్లో చేరారు. ఆయన మృతిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.